సైబర్ నేరాలపై కార్మికులకు అవగాహన



మాట్లాడుతున్న బాలానగర్ ఏసీపీ హన్మంతరావు

చింతల్: సైబర్ నేరాలపై కార్మికులు అవగాహన కలిగి ఉండాలని బాలానగర్ ఏసీపీ హన్మంతరావు అన్నారు. గురువారం జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని ఆజాద్ ఇండస్ట్రీయల్ కంపెనీలో సైబర్ నేరాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. అపరిచిత ఫోన్ కాల్స్‌ను లిఫ్ట్ చేయవద్దని, అదే విధంగా వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో లింక్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల మోసానికి గురైతే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ చైర్మన్ రాకేష్, జీడిమెట్ల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పాత్ర కీలకం



చిన్నారుల నృత్యాలు

కుత్బుల్లాపూర్: విద్యార్థులకు క్రమశిక్షణను అలవర్చడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమని ఎంఈఓ జెమిని కుమారి అన్నారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ యూకేజీ ఫ్యూచర్ ఐకాన్స్ ఫెస్ట్ అండ్ స్పోర్ట్స్ లిటరసీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారులకు పలు పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో టీవీఆర్ స్కూల్స్ చైర్మన్ కోటిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణా రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై కమిషనర్‌కు ఫిర్యాదు



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాలనీ వాసులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి రేణుకా ఎల్లమ్మ కాలనీలో రోడ్డును ఆక్రమించి చేపడుతున్న అక్రమ నిర్మాణంపై గురువారం కాలనీ అసోసియేషన్ సభ్యులు కమిషనర్ సాబేర్ అలీకి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్.. రోడ్డు ఆక్రమణపై తనకు నివేదిక అందజేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

పరిశ్రమలో ఉచిత వైద్య శిబిరం



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కుత్బుల్లాపూర్: కార్మికులకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు కార్పొరేట్ ఆసుపత్రులు ముందుకు రావాలని ఐఎన్‌టీయూసీ నాయకుడు చింతల నాగరాజు కోరారు. గురువారం రాజ్‌క్లాసిక్ ఫ్రూట్స్ కంపెనీలో లైఫ్ స్పాన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కార్మికులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్మికులకు గుండె సంబంధిత, బీపీ, షుగర్, ఇతర సాధారణ వ్యాధుల పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఆసుపత్రి యాజమాన్యం కార్మికులకు ఫ్రీ ఓపీ సేవలు అందించాలని నాగరాజు కోరగా.. సీఈవో సురేష్‌రాజు అంగీకరించారు. శిబిరంలో రాజ్ క్లాసిక్ ఎండీ రాజు, ఆసుపత్రి మార్కెటింగ్ హెడ్ రమేష్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలి

మోతీనగర్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ని ఉపయోగించవద్దని, జనప నారతో తయారు చేసిన సంచులను వాడాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కార్తీక్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని గాయత్రినగర్‌లో 'మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి' అంటూ ప్లకార్డులతో వందలాది మంది పారిశుద్ధ్య కార్మికులు గాయత్రినగర్ మీదుగా ఫ్రెండ్స్ కాలనీ, అల్లాపూర్, శివ బస్తీల మీదుగా ప్రధాన రోడ్లపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెత్తా చెదారాన్ని ఉదయం ఇంటి వద్దకు వచ్చే ఆటో రిక్షా కార్మికుడికి అందజేయాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మొక్కలను నాటాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్ వైజర్ జమీల్ అహ్మద్, ఎస్ఆర్ పీడ్ల సురేష్, సర్కిల్ జవాన్లు, ఎస్ఎఫ్ఏలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డంతా చెత్త.. తరలించకుంటే ఎట్టా?

చెత్త కుప్పలతో దుర్వాసన
- 20 రోజులు గడుస్తున్నా తరలించని అధికారులు
- తమ పరిధి కాదంటూ దాట వేస్తున్న జీహెచ్ఎంసీ, ఐలా



సంజయ్‌గాంధీ నగర్- గాంధీనగర్ రోడ్డులో పేరుకుపోయిన చెత్త

రంగారెడ్డినగర్: చెత్త డంపింగ్ పాయింట్ల వద్ద పేరుకుపోతున్న చెత్తను అధికారులు తరలించడం లేదు. దీంతో ఆ ప్రాంతాల్లో దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అది తమ పరిధి కాదంటూ దాట వేస్తున్నారు. దీంతో అధికారుల తీరుపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ పారిశ్రామికవాడను ఆనుకుని ఉన్న సంజయ్‌గాంధీనగర్ రోడ్డులో పారిశుద్ధ్యం పడకేసింది. దీనాలి ఫుడ్స్ కంపెనీ, సంజయ్ గాంధీ నగర్- గాంధీనగర్ రోడ్డులో ఇరవై రోజులుగా రోడ్ల పక్కన వేస్తున్న చెత్తను తరలించడం లేదు. దీంతో చెత్త కుప్పలుగా ఏర్పడి రోడ్డుపైకి వస్తోంది. ఈ విషయమై బస్తీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ, ఐలా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. అది తమ పరిధిలోకి రాదన్నట్లుగా ఇరు శాఖల అధికారులు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పేరుకుపోయిన చెత్తను వెంటనే తరలించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సంజయ్‌గాంధీ నగర్ వాసులు కోరుతున్నారు.



దీనాలి ఫుడ్స్ పరిశ్రమ ముందు కుప్పగా చెత్త వ్యర్థాలు

దరఖాస్తుదారులు సర్వే సిబ్బందికి సహకరించాలి

జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా

కుత్బుల్లాపూర్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ నియోజకవర్గ వ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతోంది. గురువారం కొంపల్లి మున్సిపల్ పరిధి దూలపల్లి 16, 17వ వార్డుల్లో జరిగిన సర్వే ప్రక్రియను జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు వచ్చే సిబ్బందికి దరఖాస్తుదారులు సహకరించి వివరాలు అందజేయాలన్నారు. సర్వే సిబ్బంది సకాలంలో సర్వేను పూర్తి చేసేందుకు వార్డు ఆఫీసర్లు ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగాలన్నారు. ఈ సర్వేలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, మేనేజర్ వెంకటేశం, సీనియర్ అసిస్టెంట్ రాజు, వార్డు ఆఫీసర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



దూలపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా

వీఎన్ఆర్ వీజేఐఈటీలో అంతర్జాతీయ సదస్సు



సదస్సులో సావనీర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

నిజాంపేట్: విద్యార్థులు కంప్యూటింగ్, 5జీ, 6జీ సాంకేతికతను పరిశీలించి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ఇది ఆయా రంగాల్లో పురోగతికి దోహద పడుతుందని సిలికాన్ ల్యాబ్స్ సంస్థ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ సంచాలకులు ఎన్.వెంకటేష్, ఐఈఈఈ రీజియన్ 10వ సంచాలకులు డాక్టర్ ఎస్.ఎస్.సమీర్ అన్నారు. బాచుపల్లి వీఎన్ఆర్ విజేఐఈటీ కళాశాలలో మూడు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. మైక్రో ఎలక్ట్రానిక్స్, కంప్యూటింగ్, కమ్యూనికేషన్ సిస్టమ్స్ రంగాల్లో చోటు చేసుకుంటున్న సాంకేతికపరమైన మార్పులపై ఈ సదస్సు జరుగుతుంది. ఈ సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. సదస్సులో బంగ్లాదేశ్, యూఎస్ఏ, శ్రీలంక, దక్షిణ కొరియా, పాకిస్తాన్, ఖతార్, ఇటలీ, మన దేశానికి చెందిన పలువురు పాల్గొని 785 పరిశోధనా పత్రాలు సమర్పించగా.. 9 విభాగాల్లో 143 పత్రాలను మాత్రమే సదస్సులో నివేదించడానికి ఎంపిక చేసినట్లు వీజేఐఈటీ కళాశాల విద్యార్థి పురోగతి డీన్ డాక్టర్ పద్మశాయి తెలిపారు. డిజైన్ థింకింగ్, స్వయం పర్యవేక్షక అభ్యసనపై శిక్షణా తరగతులు నిర్వహించారు. సదస్సులో టీఐఎఫ్ఆర్ ముంబాయికి చెందిన డాక్టర్ సత్యనారాయణ, ఐఈఈఈ హైదరాబాద్ విభాగాధ్యక్షులు డాక్టర్ విజయలత, గ్రీన్ మ్యాంగో అసోసియేట్ డాక్టర్ క్లిప్ కుస్‌మాల్, విజ్ఞాన జ్యోతి కళాశాల ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, డీన్ డాక్టర్ డీ.ఎస్.రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సీ.డీ . నాయుడు తదితరులు ప్రసంగించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

నిజాంపేట్: మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం విద్యార్థులకు అందజేయాలని నిజాంపేట్ కమిషనర్ సాబేర్ అలీ అన్నారు. గురువారం నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి భోజన ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందజేయాలని, మెనూ ప్రకారం భోజనాన్ని అందించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీపీ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన ఏర్పాట్లపై సమావేశమైన నిజాంపేట్ కమిషనర్

ఫ్లై ఓవర్‌లను నిర్మించాలి

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే వినతి

కూకట్‌పల్లి: నియోజకవర్గంలో అవసరమైన చోట ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని వసంత్ నగర్ కాలనీ నుంచి గోకుల్ ఫ్లాట్స్ మీదుగా హైటెన్షన్ రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. సికింద్రాబాద్ మొదలుకొని బోయిన్‌పల్లి, బాలానగర్, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి ప్రాంతాలకు చెందిన వేలాది వాహనాలు నిత్యం హైటెక్ సిటీకి రాకపోకలు సాగించేందుకు కూకట్‌పల్లి మీదుగా వెళ్తాయన్నారు. దీంతో ఇక్కడి కైత్లాపూర్ రోడ్డు, జేఎన్‌టీయూ, హైటెక్‌సిటీ రోడ్లు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుందన్నారు. మియాపూర్, హైదర్‌నగర్, నిజాంపేట, ప్రగతినగర్, బాచుపల్లి తదితర ప్రాంతాల నుంచి హైటెక్ సిటీకి వెళ్లే వాహనాలు వసంత్ నగర్ కాలనీ మీదుగా హైటెన్షన్ లైన్ రోడ్డులో ప్రయాణించి నేరుగా వసంత నగర్ కాలనీ ద్వారా హైటెక్ సిటీకి చేరుకునేందుకు గోకుల్ ఫ్లాట్స్ జంక్షన్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. ఈ నిర్మాణం చేపడితే జేఎన్‌టీయూహెచ్ రోడ్డులో నెలకొంటున్న ట్రాఫిక్ రద్దీని సగానికి పైగా తగ్గించవచ్చన్నారు. గతంలో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం తప్పనిసరిగా చేపట్టాలని నిర్ణయించారని గుర్తు చేశారు. జీహెచ్ఎంసీ అధికారులకు తగిన ఆదేశాలను జారీ చేసి గోకుల్ జంక్షన్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి, అండర్ పాస్ నిర్మాణం, మూసాపేట ఆంజనేయ నగర్ చౌరస్తా వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి, ఫతేనగర్ రైల్వే అండర్ పాస్ పనులు, కూకట్‌పల్లి హుడా ట్రక్ పార్కు స్థలాన్ని క్రీడా ప్రాంగణానికి కేటాయించడానికి పలు వినతిపత్రాలు అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

23న సీజ్ చేసిన వాహనాల వేలం

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్డీపీఎస్, డ్రగ్స్ కేసులో సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 23న వేలం పాట నిర్వహించనున్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారి ఫయాజుద్దీన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వేలం పాటలో 16 స్క్రాప్ వాహనాలు, రెండు కండీషన్‌లో ఉన్నాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జీడిమెట్ల గోదావరి హోమ్స్‌లోని కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉదయం 11.30 గంటలకు జరిగే వేలం పాటలో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ ట్రీ, జీసెస్ జననం దృశ్యాలు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ఆదిత్య గార్డెన్‌లోని పాండురంగ హెవెన్ అపార్ట్‌మెంట్‌లో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ, జీసెస్ జననం దృశ్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అపార్ట్‌మెంట్ వాసులు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు.

27న భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని పీఎఫ్ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 27న భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డాక్టర్ హేమంత్ గురువారం తెలిపారు. ప్రశాంత్ నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లోని రెండవ అంతస్తులో ఉన్న పీఎఫ్ కార్యాలయంలో, సర్దార్‌పటేల్‌నగర్‌లో, స్పైస్ ఫెసిలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ మంజు రెసిడెన్సీలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. సలహాలు, సూచనలు కూడా స్వీకరిస్తామని తెలిపారు. కూకట్‌పల్లి, జీడిమెట్ల, సనత్‌నగర్, బీహెచ్ఈఎల్ తదితర ఖాతాదారులు పాల్గొనాలన్నారు.

ముందస్తు అరెస్టు

మూసాపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా కూకట్‌పల్లి పోలీసులు చర్యలు తీసుకున్నారు. గురువారం గ్రేటర్ హైదరాబాద్ కో చైర్మన్ నపారి చంద్రశేఖర్‌ను ఉదయం 6 గంటలకు అరెస్టు చేసి ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి స్టేషన్‌కు తరలించారు.

అధికారుల తీరుతో ప్రజలకు ఇబ్బందులు

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



దుండిగల్: అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ.. బాచుపల్లి నుంచి మల్లంపేట మీదుగా బౌరంపేట వరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.140 కోట్లతో పనులు ప్రారంభించిందన్నారు. మల్లంపేటలోని గుడి వద్ద వాటర్ లైన్ కారణంగా పనులు చేయడం లేదని, వాటిని తొలగించడానికి జలమండలి అధికారులు రూ.60 లక్షలు ఖర్చు అవుతుందని చెప్తున్నారని తెలిపారు. విద్యుత్ అధికారులు సైతం విద్యుత్ స్తంభాలను మార్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శంభీపూర్-మల్లంపేట వద్ద ఎగ్జిట్ ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ తీవ్రంగా నెలకొంటుందన్నారు. వివిధ శాఖల అధికారుల సమన్వయలోపం వల్ల సమస్య జఠిలమవుతుందని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారులతో చర్చించి రూ.60 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో శంభీపూర్ రాజు ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి



నిరసలో పాల్గొన్న సీపీఐ, దళిత సంఘాల నాయకులు

- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలి
- సీపీఐ, దళిత సంఘాల డిమాండ్

జగద్గిరిగుట్ట: అంబేడ్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని సీపీఐ, దళిత సంఘాల నాయకుల డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను తక్కువ చేసి మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జగద్గిరిగుట్ట చివరి బస్టాప్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి అమిత్ షా చిత్రపటాలను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర నాయకులు ఏసురత్నం మాట్లాడుతూ.. అమిత్ షా తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోకుంటే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంజేఎఫ్ జాతీయ, రాష్ట్ర నాయకులు రామస్వామి, యాకయ్య, నాయకులు రాములు, సయ్యద్ రషీద్, బాబు, ప్రవీణ్, హరినాథ్, సహదేవ్ రెడ్డి, వెంకటేష్, నర్సింహ, సోమన్న, సోమయ్య, సామెల్, బాలాజీ, ఇమామ్, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే ఉపాధ్యాయులకు న్యాయం

నిజాంపేట్: పీఆర్‌టీయూటీఎస్ బాచుపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల శాఖ అధ్యక్షుడు పర్మగల్ల నరసింహులు అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి హాజరై మాట్లాడారు. పీఆర్‌టీయూ సంఘం బలంగా ఉంటేనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థ పటిష్టంగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనకు సంఘం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, బాచుపల్లి మండల కార్యదర్శి ప్రమోద్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు శేఖర్, జిల్లా బాధ్యులు చెన్నయ్య, ప్రదీప్‌సింగ్, మండల బాధ్యులు సుమలత, వెంకటేశ్వరరావు, శివప్రసాద్, ఉపాధ్యాయులు రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, సభ్యులు

యథేచ్ఛగా భవన వ్యర్థాల డంపింగ్



హెచ్ఎంటీ స్థలంలో డంపింగ్ చేసిన భవన నిర్మాణ వ్యర్థాలు

హెచ్చరిక బోర్డు ఉన్నా బేఖాతర్

చింతల్: వందలాది ఎకరాల విస్తరించి ఉన్న హెచ్ఎంటీ పరిశ్రమ ఖాళీ స్థలం అక్రమ డంపింగ్‌లకు అడ్డాగా తయారైంది. పరిశ్రమ ఖాళీ స్థలం చుట్టూ అనేక బస్తీలు వెలిశాయి. గతంలో హెచ్ఎంటీ అధికారులు కొన్ని ప్రాంతాల్లో ప్రహరీ నిర్మించి, మరికొన్ని ప్రాంత్లాల్లో కందకాలు తవ్వారు. కందకాలు, గోడలు ఏర్పాటు చేయని ఖాళీ స్థలాలు భవన వ్యర్థాల డంపింగ్ కేంద్రాలుగా మారాయి. డివిజన్‌లోని చింతల్ బస్టాప్ నుంచి భగత్‌సింగ్ నగర్‌కు వచ్చే దారిలో కొంతమేర హెచ్ఎంటీ అధికారులు కందకం తీయకుండా, గోడల నిర్మించకుండా వదిలేశారు. దీని పక్కనే శ్మశాన వాటిక ఉండటంతో ఇటువైపు నిర్మానుష్య ప్రదేశంగా ఉంటుంది. ఇదే అదునుగా భావించిన కొంతమంది కూల్చివేసిన ఇళ్ల వ్యర్థాలను తీసుకువచ్చి ఇక్కడ పారబోస్తున్నారు. వ్యర్థాలను వేయవద్దంటూ జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా పట్టించుకోవడం లేదు. హెచ్ఎంటీ కాలనీలోని ప్రధాన రోడ్డుకు పిల్ల బాటలు ఉండటంతో గంజాయికి అలవాటు పడ్డ యువకులు తమ అడ్డాగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. మత్తులో ఇటుగా వచ్చే పాదచారులు, వాహనదారులను వెంబడిస్తున్నారు. లక్ష్మీనగర్ నుంచి హెచ్ఎంటీ బస్టాండ్‌కు వెళ్లే దారిలో రాత్రి వేళ వీరి ఆగడాలు ఎక్కువయ్యాయి. జీహెచ్ఎంసీ అధికారులు చొరవ తీసుకొని భగత్ సింగ్ నగర్ చింతల్ శ్మశాన వాటిక నుంచి హెచ్ఎంటీ కాలనీ వరకు ప్రహరీని నిర్మించి ఆకతాయిలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.



అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ట్రాఫిక్ ఆంక్షలు.. వాహనదారులకు తిప్పలు

- పెరిగిన దూరంతో ట్రాఫిక్ చిక్కులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వాహనదారులు

కుత్బుల్లాపూర్ : ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల నేపథ్యంలో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. అడ్డదిడ్డంగా ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలిపి దారి మళ్లించే ప్రయత్నం చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుచిత్ర నుంచి కొంపల్లికి వెళ్లే రోడ్డులో ఎన్‌సీఎల్ ముందు యూటర్న్ తీసుకొని సర్వీస్ రోడ్డు మీదుగా కాటన్ పార్క్, అంగడిపేట్, హై టెన్షన్ రోడ్డు, వైష్ణవి కాలనీ, సెంటాన్స్ స్కూల్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగుతుండేవి. గురువారం అకస్మాత్తుగా ఈ యూటర్న్ మూసివేయడంతో సుమారు రెండు కిలోమీటర్లు వెళ్లి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వాహనదారులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ యూటర్న్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. 4 రోజుల క్రితం ఇక్కడ ట్రాఫిక్ ఆంక్షలు విధించినప్పటికీ రోడ్డుకి ఇరువైపులా ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలుపుతున్నారు. వాటిని కట్టడి చేయకపోవడంతో ట్రాఫిక్ పోలీసులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడ పనులు జరుగుతున్నాయో..అక్కడ ట్రాఫిక్ నియంత్రణ చేస్తూ మిగతా ప్రాంతాల్లో యథావిధిగా యూటర్న్ మూసివేయకుండా రాకపోకలు సాగించే వెసులుబాటు కల్పించాలని పలువురు కోరుతున్నారు.



ఎన్‌సీఎల్ కాలనీ ముందు యూటర్న్ మూసివేయడంతో సర్వీస్ రోడ్డు మీదుగా రాకపోకలు